పాలకుర్తిలో కాంగ్రెస్ అడ్రస్ గల్లంతు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి
- లక్ష్మాతండా, కామారెడ్డిగూడెం నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు

దేవరుప్పుల, అక్టోబర్ 25 : పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అడ్రస్ గల్లంతయ్యిందని, నిలబడే అభ్యర్థులు లేక సతమతమవుతున్నదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అ న్నారు. పాలకుర్తి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం లో మంగళవారం దేవరుప్పుల మండలం లక్ష్మాతండా నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ పాలకుర్తిలో జరిగిన అభివృద్ధి, ఇంటింటికీ అమలైన సంక్షేమ పథకాల మూలంగా ప్రతిపక్షాలకు స్థానం లేకుండా పోయిందన్నారు. కొందరు విదేశీయులు తమకే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకుంటూ తిరుగుతున్నారని, ఎలక్షన్ దగ్గర పడుతున్నా కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులు దొరకడం లేదన్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరిస్తారని, కేసీఆర్ చేస్తున్న పనులు, ముఖ్యంగా సాగు, తాగునీరు, 24 గంటల కరెంటు, కల్యాణలక్ష్మి, మహిళాభ్యున్నతి పథకాలు పార్టీకి శ్రీరామరక్షగా నిలుస్తున్నాయన్నారు. కేసీఆర్‌పై ఉన్న ప్రజాభిమానం, ఆదరణతోనే బీఆర్ఎస్‌కు ఓట్లు పడతాయని, మరోమారు రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, హ్యాట్రిక్ సీఎం కేసీఆర్ అవుతారన్నారు. పాలకుర్తి ప్రజలు తనను మరోమారు గెలిపించడానికి సమాయత్తమయ్యారని, తాను అంతే ప్రేమతో ప్రజలకు దగ్గరవుతానన్నారు. నియోజకవర్గంలో ఎల్లవేళలా ఉందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నానని, అదే తన గెలుపునకు నాందిగా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీని వీడిన వారిలో లింగ్యా, భాస్కర్, రెడ్యా, సునీత, విజయ, కవిత, సోమ్లా, నాజీ, లక్ష్మి, జ్యోతి, సరిత, హేమ్లానాయక్ ఉన్నారు. వీరి వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తీగల దయాకర్, పల్లా సుందరరాంరెడ్డి, వైస్‌చైర్మన్ అనంతోజు కృష్ణమూర్తి, మంగ్యా, లక్ష్మా, జైహింద్ తదితరులున్నారు.

మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన లక్ష్మాతండా కాంగ్రెస్ కార్యకర్తలు

కామారెడ్డిగూడెం నుంచి..

కామారెడ్డిగూడెంకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు ఆ పార్టీని వీడీ బీఆర్ఎస్‌లో చేరారు. పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాతంగి నరేశ్, సురేశ్, నర్సయ్య, చెన్నయ్య,వార్డు సభ్యులు చింత శేఖర్, చింత కొండయ్య, చంద్రయ్య, చింత నాగరాజు, మహ్మద్ జహీర్ బీఆర్ఎస్‌లో చేరగా వారికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు తీగల దయాకర్, చింత రవి, ఈదు నూరి నర్సింహారెడ్డి, చింత సోమయ్య, మామిడి సైదులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడు వీరయ్యకు నివాళులర్పిస్తున్న ఉషాదయాకర్‌రావు

మృతుల కుటుంబాలకు పరామర్శ

దేవరుప్పుల, అక్టోబర్ 25 : మండలంలోని పలు గ్రామాల్లో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలను మంగళవారం మంత్రి ఎర్రబెల్లి సతీమణి ఉషాదయాకర్‌రావు పరామర్శించారు. ధర్మాపురంలో షీల వీరయ్య మంగళవారం మృతి చెందగా ఆయన మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం అప్పిరెడ్డిపల్లిలో కొంగరి వజ్రమ్మ, నాగారపు అబ్బయ్య మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ కుటుంబ సభ్యులు మృతి చెందితే మంత్రి ఎర్రబెల్లి అండగా నిలుస్తారని, అధైర్యపడొద్దన్నారు. ఆమె వెంట తీగల దయాకర్, పల్లా సుందరరాంరెడ్డి, అనంతోజు కృష్ణమూర్తి, బజ్జూరి అశోక్, పులిగిల్ల సుధాకర్, ఖాసీం, మహేందర్, దేవరాజ్, ఎలడెల్లి వెంకన్న, నర్ర యాదగిరి, లక్ష్మణ్, నవీన్, మహేశ్, నూ కల సోమయ్య, ఎడెల్లి శ్రీనివాస్, బాషిపల్లి యాకయ్య, కోటయ్య, పులిగిల్ల శ్రీను, వెంకట్‌రెడ్డి, పిట్టల యాదయ్య, సత్యనారాయణ తదితరులున్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న రామచంద్రయ్యశర్మ

బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ నేతల పరామర్శ

పెద్దవంగర, అక్టోబర్ 25 : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు ఈదురు వెంకన్న తండ్రి భిక్షం, ముద్రబోయిన నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, బుధవారం పాలకుర్తి దేవస్థాన, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్యశర్మ స్థానిక బీఆర్ఎస్ నేతలతో కలిసి మృతులకు నివాళులర్పించి, వారి కుటుంబాలను పరామర్శించారు. వారి వెట ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు ఏదునూరి శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, పీఏసీఎస్ డైరెక్టర్ రవి, మండల యాదవ సంఘ నాయకుడు నిమ్మల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బక్కమ్మ, నాయకులు సుధీర్‌కుమార్, లింగమూర్తి, రాము, యాకూబ్‌రెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రచార రథాన్ని అడ్డుకున్న వారిపై కేసు

తొర్రూరు, అక్టోబర్ 25 : మండలంలోని చీకటాయపాలెం గ్రామంలో కొందరు యువకులు మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. గ్రామంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రచార రథాన్ని డొంక రహీం, సాయికుమార్, యాకూబ్ అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన ప్రదేశానికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకన్నట్లు సమాచారం. ఈ విషయంపై ఎస్సై జగదీశ్ మాట్లాడారు. ఎన్నికల అధికారుల అనుమతితో గ్రామాల్లోకి వచ్చే ప్రచార రథాలను ఎవరూ అడ్డుకున్న చర్యలు తీసుకుంటామన్నారు. ప్రచార రథం డ్రైవర్ ఎర్ర అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు మరో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పోచంపల్లిలో మావోయిస్ట్ వాల్ పోస్టర్లు

రేగొండ, అక్టోబరు 25 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని పోచంపల్లి గ్రామంలో మావోయిస్ట్ వాల్ పోస్టర్లు బుధవారం వెలియడంతో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పోచంపల్లికి చెందిన గాదెబోయిన సమ్మయ్యను హెచ్చరిస్తూ బడే చొక్కారావు అలియాస్ దామోదర్ (మావోయిస్ట్ చర్ల శబిరి ఏరియా కమిటీ) పేరిట పోస్టర్లు వెలిశాయి. 'ఎన్నో అరాచకాలకు పాల్పడినా భరిస్తూ వచ్చాం. నీలో ఎలాంటి మార్పు రాలేదు. నీ చావు అతి భయంకరంగా ఉంటుంది' అంటూ అందులో పేర్కొన్నారు.

నినాదాలు చేస్తున్న విద్యార్థులు, యువకులు

గ్రంథాలయాలు దేవాలయంతో సమానం

పాలకుర్తి, అక్టోబర్ 25 : గ్రంథాలయాలు దేవాలయంతో సమానమని, విద్యార్థులు, యువకులు వినియోగించుకోవాలని పోతన కళా వేదిక అధ్యక్షుడు మాన్యపు భుజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని బమ్మెరలో పోతన గ్రామ గ్రంథాలయ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పోతన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ గ్రంథ పాలకుడు దేవసాని ఉపేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవాలని, సమాజంలో ఉన్నత పౌరులుగా ఎదగాలని, జ్ఞానం ఒక్కటే చిరకాలం ఉంటుందన్నారు. సహజ కవి పోతన జన్మించిన బమ్మెరకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో కొంగ సురేశ్, మిట్టపల్లి వీరభద్రయ్య, మహంకాళి భిక్షపతి, పెంతల సురేశ్ పాల్గొన్నారు.

మండల స్థాయి క్రికెట్ విజేత పెదమడూరు

దేవరుప్పుల, అక్టోబర్ 25 : దసరా ఉత్సవాల్లో భాగంగా పెదతండా యూత్ క్లబ్ మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించగా పెదమడూరు జట్టు విజేతగా నిలిచింది. మొత్తం 24 జట్లు పాల్గొనగా మంగళవారం జరిగి ఫైనల్‌లో పెదతండాపై పెదమడూరు విజయం సాధించింది. కాగా ఈ పోటీల్లో విజేతలకు ప్రముఖ పారిశ్రామిక వేత్త, బీఆర్ఎస్ నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ ప్రథమ బహుమతి రూ. 20 వేలు, ద్వితీయ బహుమతి రూ. 10 వేలు అం దజేశారు. కాగా ప్రథమ, ద్వితీయ విజేత జట్టుకు ట్రోఫీలను గ్రామానికి చెందిన గుగులోతు పవార్ సమకూర్చారు. శ్రీకాంత్ యువసేన నిర్వాహకుడు చంద్రగిరి సంపత్ బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎం ఉపేందర్, గుగులోతు ప్రవీణ్, వెంకన్న, అనిల్ పాల్గొన్నారు.

విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

దుర్గామాత శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

చినమడూరులో దుర్గామాత శోభాయాత్ర

దేవరుప్పుల, అక్టోబర్ 25 : చినమడూరులో యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో చేపడుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గామాత శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజులు నిత్య పూజలందుకున్న దుర్గామాత నిమజ్జన కార్యక్రమంలో వందలాది యువకులు, భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. శోభాయాత్రలో దుర్గామాతకు మహిళలు మంగళహారతులు పట్టారు. కార్యక్రమంలో చైతన్య యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

రామప్పలో పర్యాటకుల సందడి

వెంకటాపూర్, అక్టోబర్ 25 : మండలంలోని రామప్ప దేవాలయం దసరా సెలవుల సందర్భంగా బుధవారం పర్యాటకులు, భక్తులతో సందడిగా మారింది. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించారు. అనంతరం రామప్ప సరస్సులో బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు.

28న ఆలయం మూసివేత

ఈనెల 28వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటల తర్వాత చంద్రగ్రహణం నేపథ్యంలో రామప్ప దేవాలయాన్ని మూసివేయనున్నట్లు ఈవో బిల్లా శ్రీనివాస్ తెలిపారు. మధ్యాహ్నం వరకు పూజా కార్యక్రమాలు జరుగుతాయని, అనంతరం గర్భగుడిని మూసివేసి తిరిగి 29న ఉదయం 6 గంటలకు ఆలయ ద్వారం తెరిచి సంప్రోక్షణ, అభిషేకం అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తామని ఈవో తెలిపారు.